క్లుప్తంగా

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



కొడకండ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : జనగామ, బచ్చన్నపేట, జఫర్‌గఢ్, చిల్పూరు, లింగాల ఘణపురం, దేవరుప్పుల, పాలకుర్తి, తరిగొప్పుల, కొడకండ్ల మండల కేంద్రాల్లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. మోకు దెబ్బ, గోపా, గౌడ సంఘం, కేజీకేఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా పాపన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో పాలకుర్తి నుంచి ఖిలాషాపూర్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా దిలీప్‌రెడ్డి



లింగాలఘణపురం : రానున్న ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొత్తపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డిని నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కీసర దిలీప్‌రెడ్డి మీడియాతో శుక్రవారం మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడంతోపాటు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చే దిశగా పాటు పడతానని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పాలకుర్తి టౌన్ : మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన శిరంశెట్టి సారయ్య–రాణి దంపతుల కొడుకు సాయి(21) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం గడుపుతున్న సాయి.. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అతను 'ఓ దేవుడా చనిపోయే ముందైనా నాకు ప్రశాంతతనివ్వు' అంటూ వాట్సప్ స్టేటస్ పెట్టాడు. సారయ్యకు ముగ్గురు కుమారులు. గతంలో ఓ కుమారుడు మృతి చెందగా ఇప్పుడు మరో కుమారుడు మరణించాడు. ఫిర్యాదు అందలేదని ఎస్సై తాళ్ల శ్రీకాంత్‌తెలిపారు.

రేషన్ డీలర్ మృతి

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన రేషన్ డీలర్ చెవుల కృష్ణమూర్తి (55) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మృతుడి గుర్తింపు

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన శిథిలావస్థలో ఉన్న మోత్కులో బావిలో ఈనెల 16న మృతదేహం లభించిన క్రమంలో మృతుడిని ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన చిట్యాల శ్రీనివాస్‌గా గుర్తించినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మృతుడి తాపీమేస్త్రీగా పని చేసే వాడని, మద్యం మత్తులో బావిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందినట్టు భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నర్మెట : మండలంలోని అమ్మాపురం, వెల్దండ, కన్నెబోయినగూడెం గ్రామాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టవర్ లైన్ మరమ్మతులు జరుగుతున్న క్రమంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోదారులు సహకరించాలని కోరారు.

ఆడియో సీడీ ఆవిష్కరణ

లింగాలఘణపురం : ప్రముఖ రచయిత, కళాకారుడు జనగామ శంకర్ రాసిన పాటల ఆడియో సీడీని కొత్తపల్లిలో కాకతీయ కళాభారతి ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తుంగ స్రవంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మాజీ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శంకర్ ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు పోకల లింగయ్య, జీవై.గిరి ఫౌండేషన్ చైర్మన్ కృష్ణ, కళాకారులు బాలయ్య, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సమీక్ష

పాలకుర్తి టౌన్: వల్మిడి రామాలయ అభివృద్ధి, ఆలయ ప్రతిష్ఠాపనపై శనివారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టర్ శివలింగయ్య, అన్ని విభాగల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆలయ చైర్మన్ వీరమాళ్ల జేహింద్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్



నర్మెట : సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

స్టేషన్‌ఘన్‌పూర్ : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చేపట్టిన రాస్తారోకో కార్యక్రమానికి వెంకటేష్ హాజరై మాట్లాడారు. వందలాది మంది ప్రాణత్యాగాలతో, సకల జనుల ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించారని మండిపడ్డారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చేకూర్చిన లబ్ధి ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు కృష్ణగౌడ్, నాయకులు తాళ్లపెల్లి శ్రీనివాస్, బూర్ల విష్ణు, తాళ్లపెల్లి కిషోర్, కె.శరత్‌కుమార్, నవీన్‌రెడ్డి, గోనెల శ్రీనివాస్, ఉపేందర్, సూర్యతేజ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నర్మెట : బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని, ఉద్యోగాల్లేక యువత రోడ్డున పడ్డారని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సొక్కం అనిల్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి తోకల శేఖర్, మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ నరేష్, వినోద్, ప్రభాకర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోలురాజు, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్ : బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమన్న, లేగ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. ధర్నాలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాకనాటి దామోదర్‌రెడ్డి, దొంగరి మహేందర్, పూసాల శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్‌రావు, రంగు రాము, సాయిని ఝాన్సీ, తదతరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ విశాలాక్షికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, నాయకులు బంగారు మహేష్, రాజు, నరేందర్‌రెడ్డి, రామచంద్రం, భాస్కర్, నారాయణ, మహేష్, కనకయ్య, రమేష్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి



శిక్షణ పొందిన మహిళలతో ఉషా దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్ : కుట్టు శిక్షణను వినియోగించుకుని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మపర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని పాలకుర్తి, విస్నూరు, ముత్తారం, గూడూరు గ్రామాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం ఆమె కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి దయాకర్‌రావుకు మహిళలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, నాయకులు ముస్కు రాంబాబు, యాకంతరావు, మదార్, బొబ్బల అశోక్‌రెడ్డి, రాఘవరావు, మాటూరి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

నర్మెట : మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలోని కనకదురమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీలు, తలుపుల తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడినట్టు ఎస్సై గైక్వాడి అనిల్‌కుమార్ తెలిపారు. ఆ రెండు ఆలయాల్లో శుక్రవారం ఆయన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాకు వివరాలు వెల్లడించారు. హుండీల్లోని నగదుతోపాటు పెద్దమ్మ తల్లి విగ్రహం మెడలోని 5 గ్రాముల పుస్తెలు తస్కరించినట్టు పూజారి పండుగ అంజయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

ఐక్యపోరాటాలతోనే సమస్యల పరిష్కారం

చిల్పూరు : ఐక్యపోరాటాలతోనే విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారమౌతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం స్పష్టం చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సమరభేరి' సైకిల్ యాత్ర మండల కేంద్రానికి శుక్రవారం చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సైకిల్ యాత్ర బృందం సందర్శించి సమస్యలను అధ్యయనం చేసింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా ఐక్య పోరాటాలు నిర్మించే లక్ష్యంతో సైకిల్ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించాలని, మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో నెలకొన్న అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్, నాయకులు లవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..!



రఘునాథపల్లి : మండలంలోని నిడిగొండ గ్రామంలోని ఓ పురాతన ఇంట్లో అర్ధరాత్రి సమయాల్లో గుప్తనిధుల తవ్వకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని త్రికుటాలయ సమీపంలో శిథిలావస్థలో ఉన్న ఇంటిని ఓ కుటుంబం వదిలేసి కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. ఈనెల 16న అమావాస్య సందర్భంగా ఆ ఇంటి యజమానురాలు కొందరు గుర్తు తెలియని వ్యక్తులతో రెండు వాహనాల్లో శిథిలమైన ఆ ఇంటికి చేరుకొని అర్ధరాత్రి సమయంలో క్షుద్ర పూజలు చేశారు. మరుసటి రోజు అర్ధరాత్రి ఇంట్లో తవ్వకాలను స్థానికులు గుర్తించి సర్పంచ్‌కు సమాచారం ఇచ్చి శుక్రవారం ఉదయం ఆ ఇంటిని పరిశీలించారు. ఇంట్లోనే నాలుగు ఫీట్ల వెడల్పు, పది ఫీట్ల లోతుతో తవ్వకాలు వెలుగులోకి వచ్చాయి. వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. తన భర్త, కూతురు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇంటిని బాగు చేయించానని, భూమిలో బొమ్మను పాతిపెట్టేందుకు తవ్వకాలు చేపట్టినట్టు ఇంటి యజమానురాలు చెప్పినట్టు తెలిసింది. గుప్తనిధుల కోసమే తవ్వకాలు జరిపారని ప్రచారం సాగుతోంది. తవ్వకాలపై పోలీసుల విచారణ సాగుతోంది.

అవగాహనతో కుష్టు వ్యాధి నివారణ



సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి శ్రీతేజ

జనగామ : కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకుని ప్రారంభ దశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చని స్థానిక అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీతేజ తెలిపారు. ఆ పీహెచ్‌సీ పరిధిలోని 30 వార్డుల్లో శుక్రవారం కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే కొనసాగింది. ఈ సందర్భంగా సంజయ్‌నగర్‌లో జరిగిన సర్వేను డాక్టర్ శ్రీతేజ పరిశీలించి మాట్లాడారు. ప్రారంభ దశలో కుష్టును గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలని చెప్పారు. ఒంటిపై సహజ చర్మపు రంగు కంటే తక్కువ లేదా ఎరుపు, రాగి రంగు కలిగిన మచ్చలు స్పర్శ, నొప్పి లేకుండా ఉంటే ఆశావర్కర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. శరీరం మీద అనుమానాస్పద రీతిలో మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సకాలంలో వ్యాధి నిర్ధారణ జరిగి పకడ్బందీగా మందులు వాడితే కుష్టును నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఎం.ఎం.రహమాన్, పారా మెడికల్ ఆఫీసర్ సకలరెడ్డి, స్వప్న, ఏఎన్‌ఎం సునీత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోటకు రూ.15 కోట్లు కేటాయించాలి

● అఖిల భారత గౌడ సొసైటీల జాతీయ అధ్యక్షుడు నాగన్నగౌడ్



పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగన్న

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న కోట పునరుద్ధరణకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని అఖిల భారతగౌడ కల్లు గీత కార్మిక సొసైటీల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు యరగాని నాగన్నగౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం పాపన్న జయంతి సందర్భంగా ఖిలాషాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జీపీకి రూ.516 రుసుం చెల్లించి కోటలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ రాచరికం అంతానికి.. వెట్టి చాకిరీ నుంచి బడుగు, బలహీన వర్గాల విముక్తి కోసం పోరాడిన పాపన్న ఆశయ సాధన దిశగా పయనించాలన్నారు. బహుజనులంతా రాజ్యాధికారం కోసం ఏకం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి శ్రీధర్‌గౌడ్, నాయకులు వెంకన్నగౌడ్, కృష్ణ, రామస్వామి, సైదులు, నరేష్, బాలుగౌడ్, చంద్రయ్య, యాదగిరి, రాజయ్య, మురళి, కుమార్, పరశరాములు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే ప్రజలు సుభిక్షం

● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పార్టీలో చేరిన వారితో మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల: కాలం చెల్లిన కాంగ్రెస్, బీజేపీలో ఉంటే అభివృద్ధి శూన్యమని.. సబ్బండ వర్గాల అభ్యున్నతి కోరే కేసీఆర్ పాలనతోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండలోని స్వగృహంలో ముస్‌పహాడ్, గొల్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్ బట్ట వీరమ్మ, బలరాం, సీనియర్ నాయకులు బట్ట పరశురాములు, యాదగిరి, సీత శేఖర్, లలిత, సందీప్, జోగు వెంకటేష్, ఎల్లేష్, గౌరమ్మ, ఉమేష్, గణేష్ ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్, రవి, పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం, మాజీ ఎంపీపీ సోమన్న, ఏల సోమసుందర్, సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడుదాం

● కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఝాన్సీరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల: తెలంగాణ సాధన పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగిస్తున్న అప్రజాస్వామిక పరిపాలనకు చరమగీతం పాడుదామని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అక్షర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమం సందర్భంగా జనగామ–సూర్యాపేట రహదారిపై పార్టీ శ్రేణుల ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అనంతరం పెద్ది కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పుట్టినరోజు కేక్ కట్ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈనెల 28 నుంచి నియోజకవర్గంలో ఊరూరు తిరిగి ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం మొదలు పెడతానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సరస్వతి, బాగాల మాలతి, వంగ కళమ్మ, దశరథ, ఈదునూరి రాజు, పారుపెల్లి శ్రీనివాస్, దామెర అనిల్, సజ్జన్, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

పాలకుర్తి టౌన్ : రాబోయే ఎన్నికల్లో పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆమె జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యకర్తలు రక్తదానం చేయగా ఝన్సీరెడ్డి సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. నియోజకవర్గంలో యువత ఏకమై మంత్రి దయాకర్‌రావును ఓడించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు హరీష్, యాకేష్, హరికృష్ణ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు రాజేష్, గోనే మహేందర్‌రెడ్డి, వంశీ కృష్ణ, కోల వేణు, శ్రీను నాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల : మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పాలకుర్తి నియోజకవర్గ నేత, ఎన్‌ఆర్‌ఐ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుక నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సోమనర్సయ్య, అబ్దుల్లా, రవీందర్, వంశీకృష్ణ, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల అరెస్టు హేయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

రఘునాథపల్లి : సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడిలో పాల్గొన్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులతోపాటు వారికి మద్దతిచ్చిన నాయకులను పోలీసులు అరెస్టు చేయడం హేయమని తెలంగాణ క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఝొడ్ల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో సంఘం ఆధ్వర్యంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులతో కలిసి శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులతోపాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్దన్‌రెడ్డిలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. సమస్యల పరిష్కారం కోసం మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు రమేష్, కనకయ్య, సమ్మయ్య, మల్లిఖార్జున్, ప్రభాకర్, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా అభివృద్ధి శూన్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి డాక్టర్ రాజయ్య, కడియం శ్రీహరి డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా అభివృద్ధి శూన్యమని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వడ్లకొండ పరశురాములు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గంలో దళితుల ఉపాధికి ఒక్క పరిశ్రమ నెలకొల్పలేదని, మినీ లెదర్‌పార్కు నిరుపయోగంగా ఉన్నా పట్టించుకునేవారు లేరన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం అయినా ఇప్పటి వరకు ఘన్‌పూర్ మున్సిపాలిటీ కాలేదని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్‌టీసీ బస్‌డిపో, ఫైర్‌స్టేషన్ తదితర సమస్యలు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు కొత్తవారికి అవకాశం ఇవ్వాలని, రానున్న ఎన్నికల్లో తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్లకొండ యాకయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

చిల్పూరు : మండలంలోని రాజవరం గ్రామంలోని గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ఎదుట రేకుల షెడ్, ఎల్లమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని స్థానిక గౌడ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నాయకుడు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్సీ శ్రీహరిని శుక్రవాకం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సమస్యను వివరించారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో నాయకులు బైరగోని ఎల్లయ్య, రంగు రవి, రత్నాకర్, కోటి, రమేష్, శ్రీకాంత్, బుచ్చయ్య, నర్సయ్య, శంకర్, శ్రీను, సాయి ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

చిల్పూరు : ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన ఉండాలని వంగాలపల్లి సర్పంచ్ అరూరి ప్రణీత ప్రదీప్ తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటర్లందరూ 2024 శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, సుధాకర్, పాపయ్య, పద్మ, ప్రభాకర్, వెంకటమ్మ, లావణ్య పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన యువతికి సన్మానం



బచ్చన్నపేట : కొన్నె గ్రామానికి చెందిన కందుకూరు సోనీ ఎస్సైగా ఎంపిక కాగా ఆమెను కట్కూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ రఘురామకృష్ణ శాలువాలతో శుక్రవారం సన్మానించారు. సర్పంచ్ మూసిని సునీత, నాయకులు బావండ్ల కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగికి..



దేవరుప్పుల : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు గిరిజన తండాల్లో విద్యుత్ అంతరాయం చోటు చేసుకోగా చెరువునీటిలోకి తెప్పపై వెళ్లి సరఫరా పునరుద్ధరించిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ నుంచి ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ధర్మాపురం జేఎల్‌ఎం రెహమాన్‌ను సర్పంచ్ బజ్జూరి అశోక్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కన్నెబోయిన దేవరాజు, నాయకులు పన్నీరు రాంబాబు, కన్నెబోయిన సురేష్, నూకల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికను హింసించిన వారిని శిక్షించాలి

జఫర్‌గఢ్ /బచ్చన్నపేట : పాలకుర్తి మండలం చెన్నూరులో దొంగతనం నెపంతో బాలికను చిత్రహింసలకు గురి చేసి హింసించిన పుస్కూరి మధుకర్‌రావు, ప్రభాకర్‌రావులను కఠినంగా శిక్షించాలని పద్మశాలి సంఘం జఫర్‌గఢ్, బచ్చన్నపేట మండలాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాల్లో డాక్టర మామిడాల సోమనారాయణ, ఈరభత్తిని అంజయ్య, మేక నర్సయ్య, అశోక్, సారంగం, గుర్రపు బాల్‌రాజు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాల సేకరణ

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామంలో చేపట్టిన దుర్గామాత ఆలయ నిర్మాణానికి నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శివరాత్రి రాజనర్సు మాట్లాడారు. గ్రామానికి చెందిన గాజ ఉమ–లక్ష్మీనర్సయ్య దంపతులు రూ.51 వేలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చల్ల సురేందర్‌రెడ్డి, రాపెల్లి చక్రపాణి, గౌరారం కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్నెళ్లలో నిర్మాణం పూర్తి

చిల్పూరు : ఆర్నెళ్లలో కృష్ణాజిగూడెం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేసేలా చొరవ తీసుకుంటానని సర్పంచ్ పుట్ట అంజనీదేవి తెలిపారు. మండలంలోని ఆ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను ఎంపీటీసీ సాదం నర్సింహులు, ఉపసర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి తండ రాంబాబుతో కలిసి సర్పంచ్ అంజనీదేవి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. నాయకులు పుట్ట రవీందర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, సాంబరాజు, రమేష్, కర్ర మల్లారెడ్డి, ఆనందం, సందుల రాజయ్య, వడ్లకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

రఘునాథపల్లి : పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ నేతృత్వంలో హైదరాబాద్‌లో త్వరలోనే నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ మడిపెల్లి శ్యామ్ కోరారు. మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో మండల ఇన్‌చార్జ్ దర్శనాల రవి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ సమావేశానికి శ్యామ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర నాయకులు కొయ్యడ మల్లేష్, బొంజురి విజయ, తదితరులు పాల్గొన్నారు.

'బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

స్టేషన్‌ఘన్‌పూర్/తరిగొప్పుల : విచారణ పేరుతో గిరిజన సామాజిక వర్గానికి చెందిన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేసిన ఎల్బీనగర్ పోలీసు అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సంపత్‌నాయక్, నూనావత్ సుమన్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో ఆయా మండల కేంద్రాల్లో మాట్లాడారు.

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని తొలగించాలి

నర్మెట : గిరిజనులను వర్గీకరిస్తామంటూ ప్రకటించిన ఎంపీ, టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డిని ఎంపీ పదవి నుంచి తొలగించాలని సేవాలాల్ సేన అధ్యక్షుడు ధరావత్ రమేష్ డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చౌరస్తాలో గురువారం రాస్తారోకో నిర్వహించి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రమేష్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు గిరిజనుల ఐక్యతను అవమానపర్చేలా ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, భిక్షపతి, వినోద్, రమేష్, రాజు, సాయి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చండిక అమ్మవారికి పంచామృత అభిషేకం

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని స్వయంభు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా శ్రీచండికాదేవి అమ్మవారికి పంచామృత అభిషేకం ,శ్రీసూక్త పూజ, విశేష నీరాజనాలు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవుల అక్రమ రవాణా వాహనం సీజ్

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారిలో వాహనాల తనిఖీ చేస్తుండగా డోర్నకల్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన బదావత్ లుకానాయక్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.